బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రావుల కోళ్ల నాగరాజు రాఖీ పండుగ సందర్భంగా మాజీ మంత్రి సబితారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.
– బండ్లగూడ,ఆగస్టు 20

నియోజక వర్గానికి నిధులు ఇవ్వండి

సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, ఆగస్టు 24: రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజురు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్, గండిపేట మండలం, శంషాబాద్ మండలాల పరిధిలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులను మంజురు చేయాలని రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

బస్‌షెల్టర్‌కు తాళాలు..రోడ్డు మీద జనం

బోరబండలో ఏసీ బస్ షెల్టర్‌కు తాళాలు వేయడంతో బయట కూర్చున్న ప్రయాణికులు

ఎర్రగడ్డ, ఆగస్టు 20 : బోరబండలో ఏసీ బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేసిన అనంతరం నెలల తరబడి అది ప్రారంభానికి నోచుకోలేదు. ఎట్టకేలకు గత నెలలో ప్రారంభించినప్పటికీ. ఎప్పుడూ తాళాలే దర్శన మిస్తున్నాయి. దీంతో చేసేది ఏమీ లేక ప్రయాణికులు బస్ షెల్టర్ బయటనే కూర్చుంటున్నారు. దీంతో లక్షలా దిరూపాయల ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ నిరుపయోగంగా మారిందని వృద్ధులు, మహిళలతోపాటు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

భారీ వర్షం..బస్తీలు జలమయం

- అవస్థలు పడ్డ వాహనదారులు
- సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

పీఅండ్‌టీ కాలనీలో వర్షం నీటిని తొలగిస్తున్న సిబ్బంది. పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ,ఆగస్టు 20 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి.రోడ్లపై పెద్ద ఎత్తున నీరు చేరడంతో జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. వేకువ జామున కురిసిన వర్షంతో పలు కాలనీలలో వర్షం నీరు భారీగా చేరింది. ఉదయం ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు ఇబ్బందులు ఏదుర్కొన్నారు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శివరాంపల్లి, బండ్లగూడ, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్ తదితర ప్రాంతాలల్లో వర్షం నీరు చేరింది. బండ్లగూడలో కమిషనర్ శరత్ చంద్ర ప్రత్యేక చొరవ తీసుకుని శానిటేషన్ అధికారులతో కలిసి వర్షం నీరు నిల్వ ఉన్న ప్రాంతాలల్లో పర్యటించి నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

రూ.3కోట్లు 'వరద' పాలు

- లాంగ్ స్టాండింగ్ అధికారుల నిర్లక్ష్యం
- మళ్లీ మునిగిన ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్
- పట్టించుకోని ఎమ్మెల్యే..కనిపించని కార్పొరేటర్

ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లోకి భారీగా చేరిన వరద నీరు

ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో ఇండ్లలోకి చేరిన వరద నీరు

ఖైరతాబాద్, ఆగస్టు 20 : దశాబ్దాలుగా నెలకొన్న వరద నీటి సమస్య ఆ కాలనీ వాసులకు తీరని వ్యథగా మారింది. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం.. జీహెచ్ఎంసీ అధికారుల అలసత్వం వెరసి మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఖైరతాబాద్‌లోని ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్ మరో సారి నీట మునిగాయి. నాలుగు అడుగుల ఎత్తులో నీరు చేరడంతో కాలనీ వాసులు తీవ్రంగా గోసపడ్డారు. గత రెండు దశాబ్దాలుగా ఈ సమస్య ఇక్కడి ప్రజలను వేదిస్తోంది. ఈ ఏడాది శాశ్వత పరిష్కారం లభించినట్లేనని ఎన్నికల ముందు ఊదర గొట్టిన ఎమ్మెల్యే దానం నాగేందర్ మాటలు వరద నీటి ముటలయ్యాయి. కోట్ల రూపాయల 'వరద' పాలయ్యాయి. ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌ను వరద ముంచెత్తడంతో ఎమ్మెల్యే, కార్పొరేటర్ పట్టించు కోకపోవడంతో తమను పట్టించుకునే వారు లేక పోయారని మండిపడ్డారు.

రూ.3కోట్లు వృథా..

గతేడాది ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో నెలకొన్న వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.7కోట్ల ప్రతిపాదిత పనుల కోసం బల్దియా రూ.3కోట్లతో పనులు ప్రారంభించింది. దీంతో హడుపుడిగా గత ఆన్నెళ్ల క్రితం బాక్స్ డ్రైన్ పనులను పూర్తి చేశారు. నీటిని తోడేసేందుకు 25 హెచ్‌పీ మోటార్లు రెండింటిని కేటాయించారు. పంపింగ్ వ్యవస్థ ద్వారా ఈ నీటిని లేక్ వ్యూ పార్కులోకి పంపించాల్సి ఉం టుంది. కానీ మోటార్లను ఏర్పాటు చేయకపోగా, ఈ వర్షాకాలంలోపే ఆ పనులన్నీ పూర్తి కావాల్సి ఉండగా, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్‌లోని లాంగ్ స్టాడింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రస్తుత పనులకు రూ.2కోట్లు ఖర్చు చేశామని చెబుతుండగా, మరో కోటి రూపాయలు ఎవరి జేబుల్లోకి చేరాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మొక్కబడిగా ఖైరతాబాద్‌కు వచ్చే ఎమ్మెల్యే కనీసం ఆ పనులపై పర్యవేక్షణ కూడా చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కనీసం తాత్కాలిక చర్యలు చేపట్టలేదు..

ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్ వరద నీటి సమస్య పరిష్కారం కాకపోగా, పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లోని వరద నీటిని తరలించేందుకు 24గంటల పాటు రెండు మోటార్లను ఏర్పాటు చేసి జీహెచ్ఎంసీ సిబ్బందిని అక్కడ నియమించి నీటిని తరలించే వారు. దీంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారమయ్యేది. అయితే ఈ ఏడాది మోటార్లు ఏర్పాటు చేయకపోగా, నిర్దేశిత పనులను సైతం పూర్తి చేయలేదు. ఇక మోటార్లకు సంబంధించిన డీజిల్, ఇతర ఖర్చులకు ఇక్కడ లెక్కలుండవని ఆరోపణలు వచ్చా యి. ఇదిలా ఉండగా, సెక్రటేరియట్, మింట్ కాంపౌండ్ పరిసరాల్లో వరద నీరు సాఫీగా వెళ్లిపోతుండగా, గ్రావిటీ ద్వారా కూడా ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్ వరద నీటిని తరలించే అవకాశాలున్నాయని స్థానికులు చెబుతున్నారు. పీడబ్ల్యూడీ వర్క్ షాప్ నుంచి లైను తీసుకుంటే ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లేనని అంటున్నారు. అలాంటప్పుడు ఇన్నీ కోట్లు ఖర్చు చేసి లేక్‌వ్యూ పార్కులో పంపింగ్ చేయాల్సిన అవసరం ఏముందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆ పార్కులో సామర్థ్యం దాటి బ్యాక్ వాటర్ కొడితే పరిస్థితి మళ్లీ మొదటి వస్తుందంటున్నారు. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం, మున్సిపల్ కమిషనర్ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అన్ని వర్గాలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మణికొండ మునిపాలిటీ ముస్లిం నాయకులు

మణికొండ, ఆగస్టు 20 : అన్ని వర్గాలకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నానని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ మైనార్టీ నాయకులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మహమ్మద్ బషీర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. గతంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి మణికొండ మున్సిపాలిటీలో ముస్లిం శ్మశానవాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని విన్నవించగా స్పం దించిన ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నెక్నాంపూర్ సర్వే సంబర్ 44లో ఐదు ఎకరాల స్థలాన్ని మంజూరు చేశారు. అలా గే శ్మశానవాటిక కోసం మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్, కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి ఎంతో సహకరించారన్నారు. తమకు చేసిన ఉపకారానికి ఎమ్మెల్యేను కలిసి సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోటిగూడ గ్రామ పంచాయతీ ఏర్పాటుపై హర్షం

ఎమ్మెల్యేను కలిసి సన్మానిస్తున్న బోటిగూడ గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 20 : బోటిగూడ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ .. మండలంలోని రామంజాపూర్ అనుబంధం గ్రామమైన బోటిగూడ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాల ప్రజలు కోరుతున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు విన్నవించడంతో బోటిగూడ గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడానికి పంచాయతీరాజ్ అధికారులు కసరత్తు పూర్తి చేసి నూతన గ్రా మ పంచాయతీగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన్నట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కూలిన చెట్టు.. ప్రహరీ, కారు ధ్వంసం

చెట్టు పడిపోవడంతో కూలిన ప్రహరీ

ఎర్రమంజిల్ కాలనీలో కారుపై పడ్డ చెట్టు

ఖైరతాబాద్, ఆగస్టు 20 : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంజాగుట్ట ఎర్రమంజిల్ కాలనీలో ఓ మహా వృక్షం నేలకూలింది. నేరుగా ఓ అపార్టుమెంట్ ప్రహరీ మీద పడడంతో గోడ పూర్తిగా కూలిపోగా, కొమ్మలు పడి రెండు కార్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యకు నిరసనగా ర్యాలీ

బండ్లగూడలో ఆశ వర్కర్లతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మేయర్ మద్దెల లత

బండ్లగూడ, ఆగస్టు 20 : పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార, హత్య ఘటనను నిరసిస్తూ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంగళవారం మేయర్ మద్దెల లత, ఆశ వర్కర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారం, హత్య చేసిన నేరస్తులను వెంటనే ఉరి తీయాలని అమె డిమాండ్ చేశారు. దేశంలో మహిళ భద్రతకు పటిష్టమైన చట్టాలను ప్రభుత్వాలు తీసుకురావాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదం.. యువతికి తీవ్ర గాయాలు

ప్రమాదానికి గురైన హారిక

బండ్లగూడ, ఆగస్టు 20 : స్కూల్ బస్ డీ కొట్టిన ఘటనలో యువతి తీవ్ర గాయాల పాలైన ఘటన రాజేంద్రనగర పోలీస్ స్టేసన్ పరిధిలో జరిగింది. పోలీస్‌లు తెలిపిన ప్రకారం.. అత్తాపూర్ రెడ్డి బస్తీకి చెందిన హారిక పిల్లర్ నంబర్ 130 వద్ద మంగళవారం ఉదయం రోడ్డు దాటుతుండగా ఓ పాఠశాలకు చెందిన బస్సు అమెను డీ కొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే కింద పడి గాయాల పాలైంది. స్థానికలు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజేంద్రనగర్ సెక్షన్ అధికారినిగా లక్ష్మీప్రియ

బండ్లగూడ, ఆగస్టు 20 : రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారిగా లక్ష్మీప్రియ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన అధికారి ల్యాండ్ కేసులో సస్పెండ్ అయ్యారు. లక్ష్మీప్రియ మహబూబ్‌నగర్ నుంచి బదిలిపై ఇక్కడికి వచ్చారని డీసీ రవికుమార్ తెలిపారు.

ఆంజనేయరెడ్డికి సత్కారం

బుద్ధవనం ప్రాజెక్ట్ సలహాదారుడిగా సి.ఆంజనేయరెడ్డి నియమితులైన సందర్భంగా మంగళవారం తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి బొకే అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మనోహర్, రాజశేఖర్, సాంబశివరెడ్డి, చారి పాల్గొన్నారు.
– హిమాయత్‌నగర్, ఆగస్టు 20

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

ఎన్‌టీఆర్‌నగరంలో కురిసిన వర్షానికి దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 20 : వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డివిజన్ పరిధిలోని కాటేదాన్, బంజారా కాలనీ, దుర్గానగర్, ఎన్‌టీఆర్‌నగర్, శీలం కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. అలాగే ఇండ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ మాన్‌సూన్ సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని అన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ప్రజలు ఉండవద్దని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, భాను, నాయకులు బుచ్చిరెడ్డి, మల్లేశ్, బబ్లూ, చందునాయక్, శేఖర్, రాజు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్

వెంగళరావునగర్, ఆగస్టు 20 : గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ అన్నారు. మంగళవారం మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేశ్ మండపాల నిర్వాహకులతో వెస్ట్ శ్రీనివాస్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఉత్సవ విగ్రహాలకు సంబందించి రూట్ మ్యాప్‌లను కూడా తెలపాలని కోరారు. ఈ సమావేశంలో మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్,ఎస్సైలు, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గురు బ్రహ్మనగర్ వాసులపై ఎమ్మెల్యే దానం సవతి ప్రేమ

- ఇళ్లు కూల్చివేస్తారని హెచ్చరిక
- బాధితులతో కలిసి ఆందోళనలో పాల్గొన్న కార్పొరేటర్

బాధితులతో కలిసి ఆందోళనలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేశ్

జూబ్లీహిల్స్,ఆగస్టు 20 : జూబ్లీహిల్స్ డివిజన్ గురుబ్రహ్మనగర్ నివాసితులపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందొకమాట.. వెనకొకమాట చందంగా వ్యవహరిస్తూ.. మూడు దశాబ్దాలుగా ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పరచుకున్న తమను బలవంతంగా ఇక్కడి నుంచి పంపిచే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రెండు రోజుల క్రితం కాలనీ పెద్దలు ఎవరూ లేని సమయంలో కాలనీలో పర్యటించి త్వరలో మీ ఇళ్లు కూల్చివేస్తారని.. నా దగ్గరికి ఎవరూ రావద్దని హెచ్చరిస్తూ భయాందోళనలకు గురిచేశారన్నారు. దీంతో మంగళవారం కాలనీ వాసులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బస్తీ వాసులకు సంఘీభావంగా స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌కు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 2009 లో అప్పటి ప్రభుత్వం తమకు పట్టాలు జారీ చేసిందని.. ప్రభుత్వం పట్టాలిచ్చిన ఈ స్థలాలలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో పేదలకు అండగా నిలవాల్సిన ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రస్తుతం పేదలను ఇళ్లు ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని కార్పొరేటర్ ఆరోపించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వార్థ ప్రయోజనాల కోసం పేద ప్రజల ఉసురు తీసుకుంటున్నారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు కట్టించకపోగా స్వయంగా కాలనీలో పర్యటించి త్వరలో మీ ఇళ్లు కూల్చివేస్తారని హెచ్చరించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇకనైనా ప్రభుత్వం, ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని పేదలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అమ్మవారికి గాజులతో అలంకరణ

సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చు కోవాలని భూలక్ష్మి ఆలయం కమిటీ అధ్యక్షుడు తోట శివకుమార్ ముదిరాజ్ అన్నారు. శ్రావణ మంగళవారం సందర్భంగా నారాయణగూడలోని భూలక్ష్మి దుర్గా దేవి అమ్మ వారికి 25వేల గాజులతో అలంకరించారు. మహిళలు లలితసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ చైర్మన్ ఐలమ్మ, సలహాదారు సంధ్య, సభ్యులు రాజేశ్, దాసు పాల్గొన్నారు.
– హిమాయత్‌నగర్, ఆగస్టు 20

తాగునీరు.. రోడ్డుపాలు

- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

వినాయకరావునగర్‌లో రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

ఎర్రగడ్డ, ఆగస్టు 20 : బోరబండ డివిజన్ వినాయకరావునగర్‌లో తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవటంతో సోమవారం రాత్రి తాగునీరు ఒక్కసారిగా వీధుల్లోకి చేరింది. నీరు వృథా కావడంతో సంబంధిత అధికారులకు స్థానికులు సమాచారకం ఇచ్చినా స్పందన కరువైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇటువంటి సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులు వచ్చి పరిష్కరించేవారని స్థానికులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారు మండి పడ్డారు.

దేశంలో మహిళలకు రక్షణేది

శంషాబాద్ రూరల్, ఆగస్టు 20 : దేశంలో మహిళలకు రక్షణలేదని ఇందుకు కోల్‌కత్తా ఘటనే నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు మైలారం సులోచన అన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అమ్మాయిలు(మహిళల)పై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.